


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 593 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 22 శనివారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా
# కూటమి ప్రభుత్వ లక్ష్యం

- అమలుకు సిద్ధంగా 100 రోజుల ప్రణాళిక
- కోస్టల్ రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీర ప్రాంతంలో ప్రత్యేక రక్షణ చర్యలు
- తమిళనాడు, కేరళల్లో విజయవంతమైన రీఫ్ కల్చర్, కోస్టల్ టూరిజంపై అధ్యయనం
- స్పీడ్ బోట్, స్కూబా డైవింగ్ లో మత్స్యకార యువతకు శిక్షణ
- డిసెంబర్ లో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మన మత్స్యకారుల సందర్శనకు ఏర్పాట్లు

2





## సినీ నటుడు విజయ్‌కి షాకిచ్చిన తమిళనాడు పోలీసులు

2

-విజయ్ ప్రచారానికి అనుమతి నిరాకరించిన పోలీసులు
-డిసెంబర్ 4న సేలంలో తలపెట్టిన సభకు అనుమతి నిరాకరణ
-నాలుగు వారాల ముందే దరఖాస్తు చేసుకోవాలని సూచన

## ఢిల్లీ హైకోర్టులో గంభీర్ కుటుంబానికి భారీ ఊరట

-గంభీర్ ఫౌండేషన్‌పై క్రిమినల్ కేసును కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు



2

## ఏపీలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల...

మార్చి 16 నుంచి ఎగ్జామ్స్

2






## వెల్లంకి గ్రామ సందర్శనలో దర్శకుడు
# యం.వి.సతీష్ కుమార్

**- ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ సేవా కార్యక్రమాలకు ప్రశంసలు**

వెల్లంకి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 21 : తెలుగు సినీ దర్శకుడు యం.వి.సతీష్ కుమార్ నేతన్నల జీవితం పై రూపొందిస్తున్న డాక్యుమెంటరీ కోసం ఇటువలే వెల్లంకి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టి.యం.ఆర్ హ్యాండ్లూమ్స్ అధినేత మరియు ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ అధ్యక్షుడు ఇడెం రాధ శ్రీనివాస్ ని ఇంటర్వ్యూ చేశారు. ఇంటర్వ్యూలో శ్రీనివాస్ నేతన్నల కష్టం, హ్యాండ్లూమ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటికి అవసరమైన సహకారం వంటి అంశాలను వివరంగా వెల్లడించారు. విద్యార్థులకు నిరంతర సహాయం అందిస్తున్న ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ కార్యకలాపాలను దర్శకుడు సతీష్ కుమార్ ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే సంస్థ చేపడుతున్న “యాదాద్రి భువనగిరి జిల్లా సమగ్ర పంచాయతీ రాజ్ సమాచార దర్శిని” అనే రాబోయే ప్రాజెక్ట్‌పై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని చేనేత వ్యాపారస్తులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని, ఇలాంటి కీలక సేవా



కార్యక్రమం సంస్థ ఆధ్వర్యంలో జరగడం విశేషమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఇడెం రాధ శ్రీనివాస్ దంపతులు దర్శకుడు యం.వి.సతీష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

# "ఫర్ యు మా" పుస్తక సమీక్ష

## - ప్రేమను పదాలుగా మలిచిన "భానుతేజశ్రీ పోలగాని" గారి పుస్తకం

తెలుగు సాహిత్యంలో ప్రేమ అనేది ఎన్నో రూపాల్లో విరజిల్లినా, ప్రతి తరం దానిని కొత్త భావంతో పునర్నిర్వచిస్తుంది. అలాంటి సున్నితమైన, స్వచ్ఛమైన ప్రేమను పదాల గర్భంలో ప్రతిబింబించిన అద్భుత కవితా సంపుటి "ఫర్ యు మా".

రచయిత్రి : భాను తేజశ్రీ పోలగాని

భాను గారి మనసులోంచి జాలువారిన ఈ ప్రేమ గీతం మొత్తం 142 పేజీలలో దాదాపు 140 ప్రేమ కవితలతో పాఠకుల మనసును తాకుతుంది.

పుస్తకం మొదటి పేజీలోనే కవయిత్రి రాసిన వాక్యాలు హృదయాన్ని మృదువుగా హత్తుకుంటాయి ు

- తొలిస్పర్శలో... అమ్మప్రేమ
- తుదిస్పర్శలో... అమ్మాయిప్రేమ లేకుండా జీవితందాటడంకష్టం
- అమ్మఅమ్మాయి... ఉన్నంతకాలం ఈ ప్రపంచంలో ప్రేమ శాశ్వతం

ఆ తర్వాత ఆమె రాసిన

- ప్రాణంతో సమానంగా నువ్వు ప్రేమించే ఆ వ్యక్తికి ఈ పుస్తకం అంకితం

అనే అంకిత వాక్యం ఈ గ్రంథానికి ఆత్మవాక్యంలా నిలుస్తుంది. మొదటి పేజీ నుంచే ఈ పుస్తకం హృదయానికి దగ్గరగా చేరుతుంది.

భాను గారి కవిత్వం కేవలం ప్రేమను వర్ణించడం మాత్రమే కాదుబీ ప్రేమను అనుభవించిన మనసు ఎలా ఆలోచిస్తుందో, ఎలా జీవిస్తుందో చూపిస్తుంది. ఒక్కో కవితలో భావాల తీయదనాన్ని, మరొకదానిలో విరహపు మృదుత్వాన్ని ఆమె ఎంతో చక్కగా మలిచారు. భాష సులభంగా ఉండి, భావం లోతుగా ఉంటుంది.

"నీ ఊపిరి గాలికి నా మనసు పరవళ్ళు తొక్కుతుంది" వంటి పంక్తులు పాఠకుడి మనసులో తాకిడిని కలిగిస్తాయి. ప్రేమను ఆమె కేవలం ఒక భావం కాకుండా ఆరాధనగా, ఒక జీవనశైలిగా ప్రతిపాదించారు.




ఈ కవితల్లో ప్రేమలోని ఆత్మీయత, ఎదురుచూపుల్లోని నిరీక్షణ, మౌనంలోనూ ఉన్న మమకారం అద్భుతంగా మిళితమై ఉన్నాయి. ఒక ప్రేయసి హృదయం మాట్లాడినట్లు ప్రతి పంక్తి సజీవంగా ఉంటుంది. విరహం కూడా ఆమె కవిత్వంలో ఒక అందమైన రూపం. భాను గారి ప్రేమకవిత్వం భౌతిక భావాలకే పరిమితం కాకుండా, ఆత్మ స్థాయిలో అనుభవించే పవిత్రతను అందిస్తుంది. అందుకే ప్రతి కవితలో ఒక నిజాయితీ, ప్రతి లైన్‌లో ఒక పవిత్రత కనిపిస్తుంది.

ఆమె కవిత్వంలో ఆధునికతతో పాటు సంప్రదాయం కూడా సహజంగా ముడిపడి ఉన్నాయి. ఒక స్త్రీగా ఆమె ప్రేమను గౌరవంగా, కానీ స్వతంత్రంగా వ్యక్తపరచగలిగారు. ప్రేమలో ఆమె నిబద్ధత ఉంది, కానీ తన ఆత్మగౌరవం కోల్పోని స్వరూపం కూడా ఉంది. అదే ఆమె రచనకు ప్రత్యేకతను తెచ్చింది.

ఈ కవితల్లో తరచుగా కనిపించే

"వెన్నెల", "జాబిల్లి", "వేణు గానం", "చిలిపి గాలి"

వంటి ప్రతీకలు కవయిత్రి మనసులోని సాహిత్యాన్ని ప్రకృతిని వ్యక్తపరుస్తాయి. ఈ కవితల ద్వారా పాఠకులు కేవలం చదవడం కాదు ు ఆ కవితని అనుభవిస్తారు. ప్రతి కవితలోనూ ఒక మృదువైన తాకిడి, ఒక మనసు లోతుని కదిలించే స్వరం ఉంటుంది.

భాను తేజశ్రీ పోలగాని గారి రచనలో భాషా సౌందర్యం, భావనలో నిజాయితీ, అనుభూతిలో మాధుర్యం %-% ఈ మూడింటి కలయిక కనిపిస్తుంది. ఒక్కో కవితలో ఒక స్వతంత్ర భావం ఉన్నప్పటికీ, మొత్తం పుస్తకం ఒకే భావప్రవాహంలా ప్రవహిస్తుంది. ప్రేమను వివిధ కోణాల్లో చూపించగల ఆమె ప్రతిభ ఈ పుస్తకాన్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది.

"ఫర్ యు మా" పుస్తకం కేవలం ప్రేమకవితల సమాహారం కాదు. అది ఒక మనసు నుంచి మరో మనసుకి వెళ్లే ఆత్మీయ సంభాషణ. భాను తేజశ్రీ గారి అక్షరాలు హృదయాన్ని తడిపి, పాఠకుడిలోని మృదుత్వాన్ని మేల్కొలుపుతాయి. ప్రతి కవిత చదివిన తర్వాత ఒక నిశ్శబ్దం, ఒక చిరు నవ్వు, ఒక గుర్తు మనసులో మిగిలిపోతుంది. ప్రేమను అక్షరాల రూపంలో శిల్పించగలిగిన అరుదైన ప్రతిభ భాను తేజశ్రీ పోలగాని గారిది. ఆమె మొదటి పేజీలో రాసిన అంకిత వాక్యం పుస్తకానికి ప్రాణం. "ఫర్ యు మా" పుస్తకం ప్రేమను ఆరాధించే ప్రతి పాఠకుని పుస్తకాల కలెక్షన్ లో ఉండాల్సిన గ్రంథం. ఇది కేవలం ఒక రచన కాదు ు ఇది ఒక మనసు భావన.

**- సమీక్ష : ఎం.నాగ అజయ్ బాబు**

---

# తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అక్షాగ్న పబ్లికేషన్స్ ఒక ప్రాముఖ్యత గల సాహిత్య-సాంస్కృతిక సభ

నవంబర్ 26, 2025 (బుధవారం) సాయంత్రం 5:00 గంటలకు, రవీంద్రభారతి మొదటి అంతస్తులో నిర్వహిస్తోంది. కార్యక్రమం రూపకల్పన చూస్తే ఇది కేవలం వేడుక కాదుసంస్కృతం, సాహిత్యం, శాస్త్రీయ కళలు మరియు ప్రాంతీయ సంస్కృతి ప్రతిష్ఠను మళ్లీ బలపరిచే యత్నంగా కనిపిస్తోంది.

ఈ సందర్భంగా 'సన్స్ ఆఫ్ సరస్వతి', 'కవిశేఖర', 'అక్షరశతఘ్ని' బిరుదులు ప్రదానం చేయడం, అలాగే మనశ్రీ జన్మదినోత్సవం జరపడం ప్రధాన భాగాలుగా ఉంటాయి. ఇవి సాధారణ గౌరవాలే కాకుండా, సాహిత్యం%-%కళల రంగంలో ప్రతిభను స్పష్టంగా గుర్తించే వ్యూహాత్మక నిర్ణయాలుగా భావించవచ్చు.

కార్యక్రమానికి ప్రారంభం చిఎఎ నారమామిడి మహాదేవ్ గారి శాస్త్రీయ నృత్యంతో ఉంటుంది. సంప్రదాయ కళారూపాలనే ఈ వేడుకకు స్వరూపంగా నిలబెట్టే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ సభకు వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించడం ద్వారా దీనిని కేవలం సాహిత్య పరిమితిలో కాకుండా, విస్తృత సాంస్కృతిక వేదికగా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. ముఖ్య అతిథులలో:



డా. రాయప్రోలు వెంకట కామేశ్వర శర్మ (మాజీ హెడ్, సంస్కృత విభాగం, గవర్నమెంట్ ఆటోనమస్ కాలేజ్, రాజమండ్రి)

డా. తానికెళ్ల భరణి (ప్రముఖ నటుడు, రచయిత)

శ్రీ జె.డి. లక్ష్మీనారాయణ, ఐపీఎస్ (మాజీ జాయింట్ డైరెక్టర్, CBCID)

డా. ఘజల్ శ్రీనివాస్ (అధ్యక్షులు, ఆంధ్ర సరస్వత పరిషత్)

డా. పి.ఎల్.ఎన్. కపార్ది (సీనియర్ కార్డియాలజిస్ట్)

డా. పి. విక్రాంత్ రెడ్డి (కిడ్నీ నిపుణులు)

డా. ఇజాజ్ హబీబ్ (గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్)

డా. బాలభద్ర వెంకట రాజు (న్యూరో ఫిజిషియన్)

శ్రీ వల్లూరి రమేష్ (సినీ నిర్మాత)

శ్రీ సింహా (ప్లేబ్యాక్ సింగర్)

'కళారత్న' బీనం (కార్టూనిస్ట్, కవి)

శ్రీ రాజకుమార్ వోడేయార్ (శిల్పి)

శ్రీ వల్లూరి రాఘవరావు ఆంధ్రజ్యోతి)

శ్రీ చంద్రలేఖ (మ్యూజిక్ డైరెక్టర్)

కోవ్వూరు (తూర్పు గోదావరి) మరియు భగ్యనగరంలోని శుభాకాంక్షకులు తమ ఆశీస్సులు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలోని 'పల్లకి ఆఫ్ సాంగ్స్' భాగం సంగీతానికి ప్రత్యేక స్థానం కల్పిస్తూ సాయంత్రం కళాత్మకతను మరింత ఘనపరిచేలా ఉంటుంది.

మొత్తానికి, ఈ వేడుక సాహిత్యం, సంస్కృతి, మరియు శాస్త్రీయ కళల పట్ల గౌరవాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో రూపొందించబడిన సమగ్ర సాంస్కృతిక సమావేశంగా నిలుస్తోంది. శుభాకాంక్షకులందరినీ ఈ పుణ్యసంధ్యను మరింత మధురంగా మార్చేందుకు ఆహ్వానిస్తున్నారు

# మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాంద్ర, నవంబర్ 21 : ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శు భాకాంక్షలు. తీరాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. కాకినాడ జిల్లా మత్స్యకార సోదరులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల ప్రణాళికను అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ తుది దశకు చేరింది. తీర ప్రాంతంలో అంతరించిపోతున్న మత్స్య సంపదను పెంపొందించే చర్యలతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కల్పనపైనా దృష్టి సారించాం. విశాఖ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, మత్స్య శాఖ సూచనల మేరకు రూపొందించిన ప్రత్యేక ప్రణాళికలను అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ కోస్టల్ రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు రూ.2 కోట్లతో ప్రత్యేక చర్యలు చేపట్టబోతున్నాం. 100 రోజుల ప్రణాళిక అమలులో భాగంగా మత్స్య సంపద పెంపొందించడం, వేట నైపుణ్యాన్ని పెంచడం, ప్రత్యేక రీఫ్ ల ఏర్పాటు, ప్రత్యామ్నయ ఆదాయ వనరుల సృష్టి తదితర అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించనున్నాం. మన మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తీసుకువెళ్లి అక్కడ విజయవంతమైన కృత్రిమ రీఫ్ కల్చర్, కోస్టల్ టూరిజం యూనిట్ల సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం.

**- సముద్రంలోకి చేప పిల్లల విడుదల**

సంప్రదాయ వేట ఆధారంగా జీవనం సాగించే మత్స్యకార సోదరులు కాకినాడలో జరిగిన సమావేశంలో మత్స్య సంపద తగ్గిపోవడం వల్ల ఇబ్బందులుపడుతున్న విషయాన్ని తెలియచేసారు. ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాం.రాష్ట్ర చరిత్రలో తొలిసారి సముద్రంలో చేపల సంఖ్యను పెంపొందించే చర్యల్లో భాగంగా ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంతాల్లో 50 వేల పండుగప్ప పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టాం. భవిష్యత్తులో ఉప్పు నీటిలో పెరిగే టైగర్ రొయ్య పిల్లలను కూడా తీర ప్రాంతాల్లో విడిచిపెట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మత్స్య సంపదను పెంపొందించడం ద్వారా మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు మత్స్యశాఖ సహకారంతో చర్యలు చేపడుతున్నాం.

**- డీప్ సీ ఫిషింగ్ కు అనుమతి**

తీర ప్రాంత మత్స్యకారులు ఇప్పటి వరకు 12 నాటికల్ మైళ్ల దూరం వరకు మాత్రమే వేటాడే అవకాశం ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ పరిధిని 200 నాటికల్ మైళ్ల వరకు విస్తరించింది. డీప్ సీ ఫిషింగ్ ద్వారా మత్స్యకార సోదరులు మంచి ధర లభించే టూనా చేపలను పట్టుకునేందుకు వీలు కలుగుతుంది.

**-కోనపాపపేటలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం**

ఉప్పాడ తీర ప్రాంత అభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా కోస్టల్ రీజైలెన్స్ స్కీమ్ కింద కోనపాపపేటకు రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో తుపాను లాంటి విపత్తుల నుంచి తీర ప్రాంత గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించేందుకు వీలుగా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నాం. ఈ కమ్యూనిటీ హాళ్లలో ఆర్.ఒ. వాటర్ ప్లాంట్లు, చేపలు ఎండబెట్టుకునేందుకు వీలుగా మూడు ఫిష్ డ్రైయింగ్ ఫ్లాట్ ఫామ్స్ నిర్మించనున్నాం. వేటకు వెళ్లిన మత్స్యకారులను సముద్రంలో ట్రాక్ చేసేందుకు వీలుగా జీపీఎస్ సిస్టం, మత్స్య సంపదను నిల్వ చేసుకునేందుకు ఐస్ బాక్సులు ఏర్పాటు చేయబోతున్నాం.

**-తీర ప్రాంతంలో టూరిజం హాట్ స్పాట్లు**

తీర ప్రాంత మత్స్యకారులకు వేటతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపైనా దృష్టి సారించాం. మత్స్యకారుల్లోని అద్భుతమైన ఈత సామర్థ్యాన్ని వినియోగించుకుంటూ కేరళ తరహాలో తీర ప్రాంత పర్యటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్ తదితర జల క్రీడల్లో మత్స్యకార యువతకు శిక్షణ ఇప్పించడం ద్వారా మన రాష్ట్ర తీర ప్రాంతాలను టూరిజం హాట్ స్పాట్లుగా తీర్చిదిద్దనున్నాం. అందుకోసం కాకినాడ తీర ప్రాంతం నుంచి కొంత మంది మత్స్యకారులను కేరళ తీసుకువెళ్లి అక్కడ మత్స్యకారులు నిర్వహిస్తున్న ఎకో టూరిజం స్పాట్ల వద్ద శిక్షణ ఇవ్వనున్నాం. చెన్నై హార్బర్ సమీపంలోని తిరువత్రియూర్ కుప్పం తీరంతో విజయవంతంగా నిర్వహిస్తున్న కృత్రిమ రీఫ్ కల్చర్ సందర్శనకు కూడా ఏర్పాట్లు చేస్తున్నాం. 1500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టన్ను సామర్థ్యం ఉన్న కృత్రిమ రీఫ్ లు సముద్రంలో ఉంచడం ద్వారా 300 రకాల సముద్ర జీవులను ఆకర్షించవచ్చు. అందులో కనీసం 50 రకాలు వాణిజ్య విలువ కలిగిన చేపలు ఉంటాయి. ఈ కల్చర్ ద్వారా రెండేళ్ల కాలంలో మత్స్యకారులకు రెండు కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. డిసెంబర్ రెండో వారంలో ఉప్పాడ,కాకినాడ తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాల సందర్శనకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నాం. మత్స్యకార దినోత్సవ వేళ మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ, వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు కట్టుబడి ఉన్నాం.

# ఏపీలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల...

## మార్చి 16 నుంచి ఎగ్జామ్స్

ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి (SSC) పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు (BSEAP) శుక్రవారం ప్రకటించింది. ఈ పరీక్షలను మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్నట్లు బోర్డు వెల్లడించింది. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఈ ప్రకటనతో విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై స్పష్టత వచ్చింది. హాల్ టికెట్లు, ఇతర వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.in ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

పరీక్షల తేదీల పూర్తి వివరాలు

మార్చి 16: ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్-1)

మార్చి 18: సెకండ్ లాంగ్వేజ్

మార్చి 20: ఇంగ్లీష్

మార్చి 23: గణితం

మార్చి 25: ఫిజిక్స్ (భౌతికశాస్త్రం)

మార్చి 28: బయాలజీ (జీవశాస్త్రం)

మార్చి 30: సోషల్ స్టడీస్ (సాంఘికశాస్త్రం)

మార్చి 31: ఫస్ట్ లాంగ్వేజ్ (కాంపోజిట్ పేపర్-2)

ఏప్రిల్ 1: OSSSC సెకండ్ లాంగ్వేజ్ (పేపర్-2)

# ఢిల్లీ హైకోర్టులో గంభీర్ కుటుంబానికి భారీ ఊరట

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. కరోనా మహమ్మారి సెకండ్ వేవ్ సమయంలో అనుమతి లేకుండా మందులు నిల్వ చేసి, పంపిణీ చేశారన్న ఆరోపణలపై గౌతమ్ గంభీర్ ఫౌండేషన్‌పై నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది.జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. గంభీర్ ఫౌండేషన్, గంభీర్, అతడి కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతిస్తూ.. ఈ కేసులో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జారీ చేసిన సమన్లను, క్రిమినల్ ఫిర్యాదును కూడా రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది.కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్న సమయంలో, ఫౌండేషన్ ద్వారా అధీకృత డీలర్ల నుంచే మందులు కొనుగోలు చేసి, మెడికల్ క్యాంపుల ద్వారా ప్రజలకు ఉచితంగా అందించామని పిటిషనర్లు వాదించారు. ఇది పూర్తిగా సేవా కార్యక్రమమని, ఇందులో ఎలాంటి లాభాపేక్ష లేదని కోర్టుకు విన్నవించారు.అయితే, డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ విచారణ ఆధారంగా ఈ కేసు నమోదైంది. ఫౌండేషన్ లైసెన్సులు లేకుండా ఫావిపిరవిర్ (ఫాబిఫ్లూ) వంటి కోవిడ్ మందులను నిల్వ చేసిందని, ఇది డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టాన్ని ఉల్లంఘించడమేనని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. దీంతో కింది కోర్టు గంభీర్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులకు సమన్లు జారీ చేసింది.

తాజా తీర్పుతో, ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ హుస్సేన్‌లకు కూడా ఊరట లభించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# సినీ నటుడు విజయ్‌కి షాకిచ్చిన తమిళనాడు పోలీసులు

ప్రముఖ తమిళ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్‌కి తమిళనాడు పోలీసులు షాక్ ఇచ్చారు. ఆయన ప్రచారానికి అనుమతి నిరాకరించారు. కొద్ది నెలల క్రితం జరిగిన కరూర్ దుర్ఘటన నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డిసెంబర్ 4న సేలంలో నిర్వహించ తలపెట్టిన ప్రచార సభ కోసం టీవీకే పార్టీ పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు చేసింది. దీనిని పోలీసు శాఖ తిరస్కరించింది.భవిష్యత్తులో విజయ్ ప్రచార సమావేశాలకు అనుమతి కోరినట్లయితే కార్యక్రమం తేదీకి నాలుగా వారాల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. తొలుత భద్రతా సమస్యల కారణంగా అనుమతి ఇవ్వలేమని పోలీసులు పేర్కొన్నారు. ఆ తర్వాత పంపిన అధికారిక లేఖలో కారణాలను పేర్కొన్నారు.

# జగ్గంపేటలో ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

## - ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజా దర్బార్ - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 21 : ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిలుస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. శుక్రవారం జగ్గంపేట క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు హాజరై వినతులు, పిర్యాదులు అందజేశారు. అందరి సమస్యలు ఓపికగా వింటూ ఎమ్మెల్యే వారి వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు ముందుంటానన్నారు. ప్రజా దర్బార్ వేదికను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 20 వినతులు ప్రజల నుంచి అందగా పలు సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట కార్యాలయంలో ప్రతి శుక్రవారం ప్రజా సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలందరికీ తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర టీం ద్వారా నియమించి ఎప్పటికప్పుడు జగ్గంపేట నియోజవర్గ సమస్యలు ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, కన్నబాబు, జనపరెడ్డి బాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, సుంకవిల్లి రాజు, పాండ్రంకి రాంబాబు, అనుకుల శ్రీకాంత్, చింతల రవికాంత్, కంచుమర్తి రాఘవ, చిట్యాల బాబ్జి, కందుల జమ్మి, మారిశెట్టి రాధా తదితరులు పాల్గొన్నారు.

# కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులకు చేయూత సాయం

ఏటూరునాగారం డివిజన్, సింహాగర్జన ప్రతినిధి, నవంబర్ 21 : ములుగు జిల్లా వాజేడు మండలంలోని కడేకల్ గ్రామంలో కాఫేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మారుమూల గ్రామ ప్రాంతంలో వరద బాధితులకు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ నిత్యవసర సరుకులు పంపిణీ చేసింది. 139 కుటుంబాలకు 10కేజీ బియ్యం, కేజీ పంచాదార, లీటరు నూనె, పప్పు, చింతపండు, మసాలాలు, పసుపు, శనగలు, కారం, దుప్పట్లు, బరకం, 3వేల రూపాయల విలువ చేసే సామాగ్రిలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పేరూరు సబ్ ఇన్స్పెక్టర్ కృష ప్రసాద్, డాన్ బోస్కో రీజనల్ కోఆర్డినేటర్ ప్రణయ్, కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ లూర్థు రాజు హాజరు అయ్యారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్న కాఫేడ్ స్వచ్ఛంద సంస్థను ఇంకా ఎన్నో సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్థు రాజు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని, గ్రామంలోనీ



ఆచారం సాంప్రదాయం మరించి పోతున్నారన్నారు. మన ఆచారాలను కాపాడుకోవాలని తెలియజేశారు. ఏజెన్సీ ఏరియాలో ప్రాంతంలో ఉపయోగపడే వివిధ పథకాలు అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందన్నారు. అలాగే బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా చెయ్యాలని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల కోఆర్డినేటర్ గొంది కామేష్, గొంది హనుమంత్, వెంకటాపురం వాజేడు మండల యానిమేటర్స్ ప్రశాంత్, నరేష్, భాస్కర్, ఇందిరా, సుజల, పద్మ, భాస్కర్, రమాదేవి, స్వరూప, ప్రసాద్ కడేకల్ గ్రామస్థులు పాల్గొన్నారు

# సంక్షేమం పేదల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వమే చేసింది

## - కులాస్‌పూర్ పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ ప్రతినిధి :
తెలంగాణ రాష్ట్రంలోనే కాదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మోపాల్ మండలం కులాస్‌పూర్ పెద్ద చెరువులో చేప పిల్లలను రాష్ట్ర మత్స్యశాఖ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగపుత్రుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలను అందిస్తోందన్నారు. చెరువులను శుభ్రంగా ఉంచడం, కాలుష్యం లేకుండా సంరక్షించడం, గంగపుత్రుల కీలక బాధ్యతని సూచించారు. చెరువుల్లో పెంచిన చేపలను మార్కెట్‌లో అమ్ముకోవడం ద్వారా గంగపుత్రులకు మంచి లాభాలు వస్తాయని అన్నారు. అలాగే సంవత్సరానికి మూడు సార్లు గంగపుత్రులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, వారికి లైసెన్సులు జారీ చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల






కోసం ఉచిత రేషన్ బియ్యం, ఉచిత రేషన్ కార్డ్,ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరా శక్తి క్యాంటీన్లు వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిందని అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం బీసీలకు వ్యతిరేక దృక్పథంతో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి పోటీలో దింపుతామని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ఒకటయ్యాయని, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కూడా ఈ రెండు పార్టీలు కలిసి ప్రచారం చేశాయి కానీ ప్రజలు కాంగ్రెస్ వైపు నిలబడి అభ్యర్థిని గెలిపించారని చెప్పారు. కులాస్‌పూర్ చెరువును పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చెరువులో దిగేందుకు మెట్లు, గట్టు పక్కన ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ చైర్మన్ శ్రీనివాస్,ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, మండల తహసీల్దార్, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం..

## - ప్రణవ్ అన్న ఆదేశాలమేరకు.. 50 కిలోల బియ్యం పంపిణి

, కమలాపూర్
కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన మౌటం పున్నం చందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మౌటం కుమారస్వామి మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు మృతుల కుటుంబాలకు నిరుపేద కుటుంబాలకు సాయం చేస్తూ అండగ నిలబడుతున్నాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు మౌటం రమేష్, కార్యదర్శిమౌటం



నిరంజన్, మాజీ కార్యదర్శి మౌటం శ్రీనివాస్, డైరెక్టర్లు మౌటం కుమారస్వామి, మౌటం లచ్చయ్య, జంగిలి అరుణ్ తదితరులు ఉన్నారు.



# అండర్ 19 విభాగంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలోకి సర్గం మహేష్

## - అభినందించిన పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతిరాజు

మక్తల్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 21 : చిన్నప్పటినుండి క్రికెట్ పై ఉన్నటువంటి మక్కువతో చురుకుగా వ్యాయామం చేయడంతో పాటు క్రికెట్లో అత్యున్నత ప్రతిఫలం కనపరచడం చూసి కోచ్ ట్రైనింగ్ తీసుకొని రాష్ట్రస్థాయిలో అండర్ 19 క్రికెట్ కు సెలెక్ట్ కావడం జరిగింది. స్కాలర్ జూనియర్స్ కాలేజీలో చదువుకుంటూ ఆత్రుత ప్రతిభను కనపరిచిన మహేష్ ను పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటపతి రాజు మాట్లాడుతూ పేద అట్టడుగు వర్గాల విద్యార్థులు విద్యారంగంతో పాటు క్రీడల్లో కూడా మంచి ప్రావిణ్యతను సాధించి అత్యున్నత స్థాయికి ఎదగాలని అన్నారు. మక్తల్ పట్టణానికి చెందిన మహేష్ దేశానికే ప్రాతినిధ్యం వహించాలని ఆశిస్తూ, కష్టపడి మరింత ఎదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుడమి ఫౌండేషన్ ఈసి మెంబర్ ప్యాట పవన్ కళ్యాణ్, కడెచుర్ ఆంజనేయులు, శ్రీను, ఎల్ల లింగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు-ప్రభుత్వానికి వారధిగా ప్రజా దర్బార్

## - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 21 : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్న లక్ష్యంతో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై తమ వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రజల నుంచి అందిన మొత్తం 312 వినతుల్లో పలు సమస్యలను ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ "ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రజా దర్బార్‌ను రూపొందించాం. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పి తక్షణ పరిష్కారం పొందే వేదిక ఇదే. అధికారులు ప్రజలకు జవాబుదారులై, సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించాలని" ఆయన సూచించారు. ప్రజలు ఈ వేదికను సద్వినియోగం చేసుకొని నిర్భయంగా తమ సమస్యలు తెలియజేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# మాక్ అసెంబ్లీకి స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపికైన ఆలమూరు విద్యార్థి అనసూరి లోకేష్

## - లోకేష్ ను అభినందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 21 : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న అమరావతిలో జరగనున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీకి ఆలమూరుకు చెందిన ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అనసూరి లోకేష్ కుమార్ ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయం వద్ద లోకేష్ కుమార్ ను ఎమ్మెల్యే బండారు దుశ్శాలువా కప్పి సత్కరించారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఆలోచనలతో విద్యార్థుల మాక్ అసెంబ్లీలో అనసూరి లోకేష్ కు స్థానం లభించడం అరుదైన అవకాశమన్నారు. ఇది అందరికీ లభించే అవకాశం కాదని, అదృష్టంగా భావించాలన్నారు. కొత్తపేట నియోజకవర్గానికి స్టూడెంట్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించనున్న లోకేష్ కు అభినందనలు తెలియజేశారు.

# నాస్తిక వాదనలు అర్థం లేనివి

## రాజమౌళికి అండగా నిలబడ్డ ఆర్జీవి

దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఇటీవల తాను దేవుడిపై పెద్దగా నమ్మకం లేదని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. గ్లోబ్ ట్రాటర్ సినిమా ఈవెంట్‌లో ఆయన చేసిన ఈ కామెంట్స్‌పై పలు హిందూ సంఘాలు, బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ వివాదంపై తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రాజమౌళికి మద్దతుగా నిలడడమే కాకుండా విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చాడు. రాజమౌళిపై విషం కక్కుతున్న సోకాల్డ్ ధర్మ రక్షకులు తెలుసుకోవాల్సింది ఏంటంటే? భారతదేశంలో నాస్తికుడిగా ఉండటం నేరం కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 దేవుడిని విశ్వసించకపోవడాన్ని కూడా రక్షిస్తుంది. అందుకే, మీరు దేవుడిని నమ్ముతున్నామని చెప్పే హక్కు మీకు ఎంత ఉందో, రాజమౌళికి కూడా తనకు దేవుడిపై నమ్మకం లేదని చెప్పే హక్కు అంతే ఉంది. అయితే రాజమౌళి దేవుడిని నమ్మకపోతే తన సినిమాల్లో దేవుడిని ఎందుకు చూపిస్తున్నాడు? అనేది మూర్ఖపు వాదన. ఆ లెక్కన, గ్యాంగ్‌స్టర్ సినిమా తీయాలంటే దర్శకుడు గ్యాంగ్‌స్టర్‌గా మారాలా? హారర్ సినిమా కోసం దెయ్యంగా మారాలా? అని ఆర్జీవీ విమర్శకులను ప్రశ్నించారు. నిజం చెప్పాలంటే? రాజమౌళి దేవుడిని నమ్మకపోయినా చాలా మంది దేవుడిని నమ్మేవారు కూడా తమ జీవితాల్లో చూడనంత విజయం, సంపద నాస్తికుడైన రాజమౌళికి ఇచ్చాడు. దీనిని బట్టి చూస్తే దేవుడు నాస్తికులనే ఎక్కువగా ప్రేమిస్తున్నాడేమో, లేదా దేవుడు అసలు జనాలను పట్టించుకోడేమో? లేదంటే ఎవరు నమ్ముతున్నారని లెక్కలు రాసుకునే నోట్‌ప్యాడ్ పట్టుకొని దేవుడు కూర్చోలేదేమో? అని ఆర్జీవీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాజమౌళితో దేవుడికే సమస్య లేనప్పుడు, ఈ స్వయం ప్రకటిత ధర్మ రక్షకులైనవారు ఎందుకు బీపీ, అల్సర్ తెచ్చుకుంటున్నారు? నిజమైన సమస్య ఆయన నాస్తికత్వం కాదు. దేవుడిని నమ్మకుండానే ఆయన విజయం సాధించడమే అసలు సమస్య. ఎందుకంటే దేవుడిని పిచ్చిగా ప్రార్థించినా విజయం సాధించలేని వారిని ఇది భయపెడుతోంది అని ఆర్జీవీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విశ్వాసులు దేవుడిని రక్షించడం మానేయాలి. అది దేవుడిని అవమానించినట్లే. రాజమౌళి నాస్తికుడైనంత మాత్రాన దేవుడి శక్తి తగ్గదు. నమ్మకం ఆగిపోయిన వెంటనే విశ్వాసం కూలిపోతుందని భావించే వారి ఇన్ సెక్యూరిటీ మాత్రమే పెరుగుతుంది అని ఆర్జీవీ అన్నారు. చివరిగా.. దేవుడు బాగానే ఉన్నాడు. రాజమౌళి బాగానే ఉన్నాడు. వీరిద్దరినీ అర్థం చేసుకోలేని వారు మాత్రమే బాధపడుతున్నారు. రాజమౌళి తదుపరి చిత్రం 'వారణాసి' ద్వారా దేవుడు ఆయన బ్యాంకు బ్యాలెన్స్‌ను మరింత పెంచుతాడు. దేవుడి నమ్మకం పేరుతో అసూయ పడుతున్న వాళ్లు ఏడుస్తూ కూర్చోవడమే. జై హనుమాన్ అంటూ ఆర్జీవీ తన వ్యాఖ్యలను ముగించారు.






# రిలీజ్‌కు ముందే బాలయ్య మేనియా..

### రికార్డు ధరకు 'అఖండ-2' రైట్స్




నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న 'అఖండ-2' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టే సినిమా విడుదల కాకముందే రికార్డు స్థాయిలో ప్రీ-రిలీజ్ బిజినెస్ చేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ఏరియాల థియేట్రికల్ హక్కులు భారీ మొత్తానికి అమ్ముడయ్యాయి.తాజా సమాచారం ప్రకారం, ఉత్తరాంధ్ర హక్కులను గాయత్రీ దేవి ఫిల్మ్స్ అధినేత సతీశ్ రూ. 13.50 కోట్లకు దక్కించుకున్నారు. గుంటూరు హక్కులను రూ. 9.50 కోట్లకు రాధాకృష్ణ ఎంటర్టైన్మెంట్స్, తూర్పు గోదావరి రైట్స్‌ను రూ. 8.25 కోట్లకు విజయలక్ష్మి సినిమాస్ సొంతం చేసుకున్నాయి. అలాగే, కృష్ణా జిల్లా రూ. 7 కోట్లు, పశ్చిమ గోదావరి రూ. 6.5 కోట్లు, నెల్లూరు రూ. 4.4 కోట్లు పలికినట్లు తెలుస్తోంది.ఇక, సీడెడ్ ఏరియా హక్కులను ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ శోభన్ ఏకంగా రూ. 24 కోట్లకు కొనుగోలు చేశారు. మరోవైపు, నైజాం ఏరియా రైట్స్ కోసం నిర్మాతలు రూ. 30 కోట్లు కోట్ చేస్తున్నారని, ఈ హక్కులు ప్రముఖ నిర్మాత దిల్ రాజు చేతికి వెళ్లే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త మీనన్, ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లిమ్స్ అద్భుతమైన స్పందన తెచ్చుకుంది. షూటింగ్, డబ్బింగ్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమాను డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# ప్రభాస్ అభిమానులకు ఇక పండగే

### -23న రాజసాబ్ నుంచి పాట విడుదల

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహాబ్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.




Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com